సాక్షి పెద్దపల్లి

బుధవారం, 16, ఆగస్టు, 2023





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


జాతీయ జెండాతో చిన్నారి

సంక్షేమానికి వెన్నుదన్ను

గృహలక్ష్మి, బీసీ, దళిత, మైనార్టీబంధుకు పెద్దపీట

- సబ్బండవర్గాల సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం
- స్వాతంత్ర్య వేడుకల్లో మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు


మాట్లాడుతున్న భానుప్రసాదరావు

సాక్షి, పెద్దపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాలసంక్షేమానికి వెన్నుదన్నుగా నిలుస్తోందని, గృహలక్ష్మి, బీసీ, మైనార్టీ, దళితబంధు పథకాలతోపాటు వికలాంగుల పింఛన్ పెంపుతో వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని శాసనమండలి చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీసు నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా ప్రగతిని నివేదించారు. దేశానికే తలమానికంగా.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తోందని, బంగారు తెలంగాణ నిర్మాణానికి బాటలు వేస్తోందని అన్నారు.


హాజరైన పట్టణ ప్రముఖులు


వృద్ధులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


విద్యార్థుల నృత్య ప్రదర్శన

కులవృత్తులకు ప్రోత్సాహం

- కులవృత్తులను ప్రోత్సహించేందుకు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రెండోవిడత గొర్రెల పంపిణీ కార్యక్రమం, బీసీ కుల, చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం కింద ఇప్పటివరకు 900 మంది లబ్ధిదారులకు రూ.9కోట్లు పంపిణీ చేశామన్నారు. అలాగే మైనార్టీలకు మొదటివిడతలో 106 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున రూ.1.06 కోట్లు ఆర్థిక సహాయం అందించేందుకు అర్హుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు సాధించామని, కంటివెలుగు, డయాగ్నొస్టిక్ హబ్, పల్లె, బస్తీ దవాఖానాలు, డయాలసిస్ కేంద్రం, జిల్లాకేంద్రంలో ఆరు పడకల పాలియేటివ్ కేంద్రం, రామగుండంలో 15 పడకల న్యూబోర్న్ కేర్ యూనిట్ ప్రారంభించుకున్నామని తెలిపారు.

పల్లె ప్రగతికి 14 అవార్డులు

- పల్లె ప్రగతి కార్యక్రమం క్రింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.212 కోట్లకుపైగా ఖర్చు చేసి ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్యాంకర్, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు, నర్సరీ, కంపోస్ట్ షెడ్లు, క్రీడాప్రాంగణాలు , పల్లె ప్రకృతి వనాల వంటి సదుపాయాలు కల్పించామని భానుప్రసాదరావు అన్నారు. ఫలితంగా జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 14 అవార్డులు అందించిందని తెలిపారు

రైతు సంక్షేమం కోసమే రుణమాఫీ

తెలంగాణ ఏర్పడిన తరువాత కొలువుదీరిన తొలి ప్రభుత్వంలో జిల్లాలోని 81,653 మంది రైతుల తీసుకున్న రూ.72.20 కోట్ల పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. రెండోదఫా అధికారంలోకొచ్చాక 89,456 మంది రైతులకు రూ.535.39 కోట్ల రుణాలను దశలవారీగా మాఫీ చేస్తోందని వెల్లడించారు. ఇప్పటివరకు 15,495 మంది రైతులకు సంబంధించిన రూ.35.93కోట్లు మాఫీ అయ్యాయని, మిగతా రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గృహలక్ష్మి కింద ప్రతినియోజకవర్గంలో మొదటివిడుతలో 3వేలమంది నిరుపేదలను ఎంపిక చేసి, వారికి దశలవారీగా రూ.3లక్షలు అందజేస్తామన్నారు. దివ్యాంగులకు పింఛన్‌ను ఇప్పుడిస్తున్న మొత్తానికి మరో రూ.వెయ్యి పెంచి.. జూలై నుంచి రూ.4016 చొప్పున అందిస్తామని వెల్లడించారు.

కార్యక్రమం సాగిందిలా..

- స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక పదర్శనలు ఆకట్టుకున్నాయి.
- పాలకుర్తిలోని కస్తూరిబాగాంధీ, పెద్దపల్లిలోని మహాత్మజ్యోతిరావు పూలే, రామగిరిలోని కస్తురిభాగాంధీ, మంథనిలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థినుల నృత్యాలు అలరించాయి.
- జిల్లాకేంద్రంలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల పిరిమిడ్‌లు ఆకట్టుకున్నాయి.
- జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు చీఫ్‌విప్ భానుప్రసాద్‌రావు ప్రశంసా పత్రాలు అందించారు.
- 320 స్వశక్తి సంఘాలకు సంబంధించి రూ.23.53 కోట్ల విలువైన రుణం చెక్కు, 64 మెప్మా సంఘాలకు రూ.7.40 కోట్ల విలువచేసే రుణాలు పంపిణీ చేశారు.
- దివ్యాంగుల సంక్షేమ శాఖ కింద రూ.10 వేల విలువ చేసే నాలుగు 4జీ ఫోన్లు, రూ.1.5లక్షల విలువ చేసే 9 బ్యాటరీ చైర్లు, రూ.1.75లక్షల విలువ చేసే 12టూ వీలర్ వాహనాలు, రూ.1500 విలువచేసే 12 వినికిడి యంత్రాలను లబ్ధిదారులకు అందించారు.


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న తానిపర్తి భానుప్రసాదరావు, చిత్రంలో కలెక్టర్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్


జాతీయ జెండాను ఎగురవేస్తున్న చీఫ్‌విప్ భానుప్రసాదరావు, చిత్రంలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, డీసీపీ, తదితరులు

- కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడ, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాం ప్రసాద్ లాల్, డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఆర్డీవో మధుమోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

న్యూస్‌రీల్

కార్యకర్తలు కష్టపడితేనే మంచి ఫలితాలు


మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: ప్రజలు తమ వెంటే ఉన్నారని, తప్పుడు ప్రచారం చేసే వారి నోళ్లు మూయించేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల శిక్షణ శిబిరంలో మాట్లాడారు. 2014లో కార్యకర్తల సమష్టి కృషితో ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధిని అభివృద్ధి బాటలో నిలిపానని, అయితే ఓర్వలేక తనపై తప్పుడు ప్రచారం చేసి 2018లో జరిగిన ఎన్నికల్లో దూరం చేశారని తెలిపారు. ఈసారి మరోసారి మోసపోకుండా ఉండాలని పేర్కొన్నారు.

'రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయం'

గోదావరిఖని: పోలీసులను హెచ్చరిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని రామగుండం కమిషనరేట్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోశలింగం తెలిపారు. పోలీసుల పేర్లు రెడ్‌డైరీలో నమోదు చేస్తున్నామని, అలాంటి వారి గుడ్డలూడదీయిస్తామని అభ్యంతరకరంగా మాట్లాడడం తగదని తెలిపారు. శాంతిభద్రతల రక్షణకే పోలీసుశాఖ ఉందని గుర్తు చేశారు. పోలీసులు చట్టానికి లోబడి పనిచేస్తారని, వారికి భంగం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని వెల్లడించారు.

నేటి నుంచి సమ్మెలోకి సెకండ్ ఏఎన్‌ఎంలు


చంద్రశేఖర్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న స్వరూప

సుల్తానాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్‌ఎంలు ఈనెల 16 నుంచి సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు డాక్టర్లు, జిల్లా వైద్యాధికారికి మంగళవారం సమ్మె నోటీస్‌ను అందించారు. ఈనెల ఏడో తేదీ నుంచి పలు రకాలుగా నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు వెళ్తున్నట్లు ఏఐటీయూసీ రెండో ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అర్బన్ ప్రాథమిక కేంద్రాల్లో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు సమ్మెలోకి వెళ్తే సేవలు నిలిచిపోతాయని అధికారులు అంటున్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన


ప్రచారం చేస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో మంగళవారం గడపగడపకూ విజ్జన్న పేరుతో చేపట్టిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే అవకాశం ఇవ్వాలని, కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, సంతోష్, ఎడెల్లి శంకర్, సంపత్, సుధాకర్‌రెడ్డి, రాజేశం, సోగాల సాగర్, రాజు, వెంకటేశ్, రవి, వీరేశం, భాస్కర్, సది, రాజ్‌కుమార్, కిషన్, రమేశ్ తదితరులున్నారు.

ఊపిరి ఉన్నంతవరకూ ప్రజా సేవ చేస్తా


మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఊపిరి ఉన్నంతవరకూ రామగుండం ప్రాంత ప్రజలకు సేవ చేస్తానని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రజాదీవెన సభలో మాట్లాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానికులు గజమాలతో సన్మానించారు. తాను గతంలో ఓడినా మరుసటిరోజు నుంచే ప్రజా సమస్యలపై పోరాటం చేశానన్నారు. ఈసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేళ పిల్లలకు పాచిపోయిన ఆహారం

- ఆందోళన బాట పట్టిన విద్యార్థులు
- మంథని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సమస్యల తిష్ట..
- అందుబాటులో ఉండని సంరక్షకులు


నిరసనకు దిగిన విద్యార్థులు, ప్రజాసంఘాలు


విచారణ జరుపుతున్న జిల్లా సంక్షేమ అధికారులు

మంథని: సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చినట్లు సర్కారు గొప్పలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. స్వాతంత్ర్య వేడుక రోజే మంథనిలోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహం విద్యార్థులకు పాడైన ఆహారం పెట్టారు నిర్వాహకులు. దీంతో చిన్నారులు ఆందోళన బాట పట్టారు. ఉదయం పెట్టాల్సిన టిఫిన్ మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇచ్చారని, పులిసిన, వాసన వస్తున్న ఇడ్లీలు వడ్డించారంటూ ప్లేట్లతో బయటకు వచ్చి వసతి గృహం ముందు నిరసన తెలిపారు. వారికి ప్రజాసంఘాల నాయకులు తోడుకావడంతో స్థానిక ప్రధాన చౌరస్తా వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. వారంక్రితం కూడా పులిసిపోయిన ఇడ్లీలు పెట్టారని వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినట్లు విద్యార్థులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఆర్ఐ రాజిరెడ్డి రెవెన్యూ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వసతి గృహానికి చేరుకుని ఇడ్లీలను పరిశీలించారు. అవి వాసన రావడంతో సంక్షేమ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు ఆనందంగా స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటే వారికి రుచికరమైన భోజనం పెట్టకుండా పాడైన ఆహారం పెట్టారంటూ కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించారు. ఘటనపై జిల్లా సంక్షేమ అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ) నాగలేశ్వర్, ఏఎస్‌డబ్ల్యూఓ విజయపాల్ రెడ్డి, ఇతర అధికారులు విచారణ చేపట్టారు. విద్యార్థులు, సంరక్షకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

వసతి గృహంలో లోపించిన పారిశుధ్యం

వసతి గృహంలో 170 మందికి ప్రస్తుతం 90 మంది వరకు ఉన్నారు. ఇక్కడి వసతి గృహంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక ఎక్కడి చెత్త అక్కడే తిష్టవేసింది. హాస్టల్ మొత్తం దుర్వాసన వస్తోంది. సిబ్బంది కొరతతో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని తెలిసింది. నీటి సమస్యతో విద్యార్థులు ఇటీవల ఆర్టీసీ బస్టాండ్, పశువుల ఆస్పత్రికి వచ్చి స్నానాలు చేశారు.

స్థానికంగా ఉండని వార్డెన్లు

వసతి గృహంలో ఇద్దరు వార్డెన్‌లు విధుల్లో ఉండాల్సి ఉన్నా.. ఒక్కరూ సక్రమంగా హాజరుకావడం లేదని సమాచారం. పదో తరగతి విద్యార్థులు, వాచ్‌మెన్లకు బాధ్యతలు అప్పగించి వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. సంరక్షకులు హాస్టల్‌లో ఉండకపోవడంతో పిల్లలు బయట తిరుగుతున్నారు. అయినా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన సంఘటనల్లో జిల్లా అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెట్టడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుండాలి

పెద్దపల్లిరూరల్/జూలపల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేలా అధికారులు పనిచేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లను ఈజీ ఎస్ పీడీ శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. కేంద్రబృందం పరిశీలించనున్న క్రమంలో అన్నివిభాగాల అధికారులు సమష్టిగా పనిచేయాలన్నారు. సర్పంచ్ జయప్రద, కార్యదర్శులు మసియొద్దీన్, ప్రశాంత్‌లున్నారు.

పెద్దాపూర్ సందర్శన

జూలపల్లిలోని పెద్దాపూర్‌లో అరుణశ్రీ ఆకస్మికంగా పర్యటించారు. స్వచ్ఛసర్వేక్షణ్ కేంద్రబృందం గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు చేశారు. డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో వేణుగోపాలరావు, సర్పంచ్ భారతి పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

ఎన్టీపీసీలో గ్రీన్ ఎనర్జీ విస్తరణ


ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

- త్వరలో 170 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సన్నాహాలు
- టీఎస్‌టీపీపీలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి విజయవంతం
- ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సీజీఎం కేదార్ రంజన్ పాండు


ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందిస్తున్న సీజీఎం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థ గ్రీన్‌ఎనర్జీ విస్తరణ దిశగా వేగంగా అడుగులు వేస్తోందని, సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుతో రాష్ట్రానికి మరిన్ని విద్యుత్ వెలుగులు అందుతాయని, ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని మహాత్మగాంధీ క్రీడా మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుక సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ స్టేజీ–1లోని 800 మెగావాట్ల మొదటి యూనిట్ గతనెల విద్యుత్ ఉత్పత్తి దశలోకి వచ్చిందని, త్వరలోనే మరో 800 మెగావాట్ల యూనిట్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎనర్జీ సేవింగ్ సర్టిఫికెట్ లభించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో 100 మెగావాట్ల సోలార్ విద్యుత్, మరో 70 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. అత్యుత్తమ ప్రతిభ కనభర్చిన ఉద్యోగులకు అవార్డులు అందించారు. కేంద్రీయ విద్యాలయం, జెడ్పీహెచ్‌ఎస్, సెయింట్ క్లేర్, సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పరేడ్‌ప్లాటూన్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, దీప్తి మహిళా సమితి సభ్యురాళ్లు, సీనియర్ కమాండెంట్ ముఖేష్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఎన్‌కే.సింగ్, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకట స్వామి, ప్రధానకార్యదర్శి కొలిపాక మల్లయ్య, అధి కారుల సంఘం నాయకులు సోమ్లా బూక్యా పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలిండియా హాకీపోటీలకు జెన్‌కో ఉద్యోగులు



క్రీడాకారులు లగిశెట్టి రవికుమార్, అటికేటి రాజేష్

రామగుండం: ఈనెల 24, 26 తేదీలలో హర్యానా రాష్ట్రంలోని పంచకుల జిల్లా స్టేడియంలో జరిగే ఆలిండియా హాకీ టోర్నమెంట్ పోటీలకు రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ (ఆర్‌టీపీఎస్) నుంచి ఇద్దరు ఉద్యోగులు ఎంపికయ్యారు. ఇందులో ఫోర్‌మెన్ గ్రేడ్–1 ఉద్యోగి లగిశెట్టి రవికుమార్, ప్లాంట్ అటెండెంట్ అటికేటి రాజేశ్ ఉన్నారు. క్రీడాకారులను సివిల్ ఈఈ సూర్యనారాయణరెడ్డి, బీఎంఎస్ నాయకులు నర్సింహులు, నూనె రాజు, శ్రీకాంత్, కనకయ్య తదితరులు అభినందించారు.

కుటుంబ సభ్యులకు వృద్ధుడి అప్పగింత



కుటుంబ సభ్యులతో వృద్ధుడు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్ల, ముస్త్యాల శివారులో ఊబిలో చిక్కుకున్న వృద్ధుడిని గోదావరిఖని టూటౌన్ బ్లూకోల్ట్స్ పోలీసులు అతడి బంధువులకు అప్పగించారు. బురదలో పడిపోయిన వృద్ధుడిని పోలీసులు కాపాడి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించిన విషయం తెల్సిందే. సోషల్ మీడియా, పత్రికల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. మంచిర్యాల జిల్లా, జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన మోతే భిక్షం (70) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల శివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి రూ.6,230 స్వాధీనం చేసుకుని పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరంతా వివిధ వైన్స్ షాపుల్లో పనిచేసే వారీగా గుర్తించారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

మంథని: మంథని మండలం ఆరెంద సమీపంలోగల గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. మొలతాడు, కడెం ఉన్నాయని, గ్రామ కారోబార్ రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



భానుప్రసాదరావు నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి

ఉత్తమ ఉద్యోగులు వీరే...

సాక్షి, పెద్దపల్లి: జిల్లాకేంద్రంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా పలువురు ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకున్నారు. వారికి చీఫ్‌విప్ తానిపర్తి భాను ప్రసాదరావు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్ లాల్, అరుణశ్రీ తదితరులు ప్రశంసపత్రాలు అందించారు. వారిలో కొందరు..



వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో జూలపల్లి; రవీందర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ; పద్మావతి, తహసీల్దార్; ఆర్.శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్; జె.సురేందర్, నాయబ్ తహసీల్దార్; ప్రవీణ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్; ఉదయశ్రీ, గిర్దావార్-2, శ్రీరాంపూర్; వజాహత్ అలీ, జూ.అ, కలెక్టరేట్



ఎస్.వేణుగోపాల్, సీఐ గోదావరిఖని; టి.శ్రీనివాస్, ఎస్సై కాల్వశ్రీరాంపూర్; ఎస్.వెంకటేశ్, ఎస్సై బసంత్‌నగర్; బి.రామస్వామి, ఏఎస్సై, పెద్దపల్లి; నవీన్‌కుమార్, పీసీ, జూలపల్లి; శ్రావన్‌కుమార్, పీసీ పొత్కపల్లి; ఎన్.రాజు, పీసీ ధర్మారం; ఎస్. శ్రీనివాసచారి, హెచ్‌సీ రామగిరి



హరీశ్, పీసీ ధర్మారం; నరేశ్, పీసీ, సైబర్ సెల్ రామగుండం; సాజిద్ బేగ్, పీసీ ట్రాఫిక్, పెద్దపల్లి; వెంకటేశ్వర్‌రావు, పీసీ, జీడీకే-1టౌన్; రజిత, విమెన్‌పీసీ, ధర్మారం; రవికుమార్, మైనింగ్ అసిస్టెంట్; సుమలత, బీసీ వెల్ఫేర్; నరేందర్, సీ.అ, సీపీఓ; వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్; ఇమ్రాన్, జూ.ఇన్స్‌పెక్టర్



రమేశ్, హెచ్‌సీ ఇంటెలిజెన్స్; అబిద్‌పాషా, పీసీ ఇంటలిజెన్స్; శైలజాశాంతి, ఏపీఎం కమాన్‌పూర్; సంపత్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్, జూలపల్లి; టి.రవికుమార్, ఎంవీఐ, పెద్దపల్లి; చంద్రకిరణ్, సీ.అ. విద్యాశాఖ; డి.శ్రీనివాస్, ఫైర్ ఆఫీసర్; జి. మౌనిక, మెప్మా ఏడీఎంసీ; వంశీకృష్ణ, ఈఈ మిషన్ భగీరథ; బి. శ్రీనివాస్ టెక్నికల్ పంచాయితీరాజ్; శేషయ్య సూరి, ఎంపీఓ కమాన్‌పూర్; వినోద్‌రాథోడ్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్; ఎం.రాజు ఎంపీడీవో, పెద్దపల్లి

ఎగిరిన మువ్వన్నెల జెండా



రైల్వేహమాలీ సంఘం కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చందర్



జెండా ఎగురవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని/మంథని: ఊరూరా.. వాడవాడన మువ్వన్నెల జెండాను ఎగురవేసి స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఓ రంగారావు, ఎక్సైజ్ కార్యాలయంపై ఈఎస్ మహిపాల్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారి కార్యాయలంలో డీసీపీ వైభవ్ గైక్వాడ్, తూనికలు, కొలతల శాఖ కార్యాలయంపై జిల్లా అధికారి విశ్వేశ్వర్, జిల్లా గ్రంథాలయం వద్ద చైర్మన్ రఘువీర్‌సింగ్, వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చైర్మన్ జడల సురేందర్, దేవాదాయశాఖ ఆఫీసు వద్ద ఇన్స్‌పెక్టర్ శంకరయ్య జాతీయజెండా ఎగురవేశారు. పెద్దపల్లి మున్సిపల్ ఆఫీసు వద్ద చైర్మన్ మమతారెడ్డి, ఆర్డీఓ ఆఫీసు వద్ద ఆర్డీఓ మధుమోహన్, కాంగ్రెస్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, బీజేపీ ఆఫీసువద్ద మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా ఆసుపత్రిలో డీసీహెచ్‌ఎస్ రమాకాంత్ పతాకాన్ని ఆవిష్కరించారు. గాయత్రీ టెక్నో స్కూల్ కరస్పాండెంట్ రజనీ, విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.



జిల్లాకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి

మంథనిలో..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు, ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పుట్ట శైలజ జాతీయ జెండాను ఎగురవేసారు. ఆర్డీఓ హనుమనాయక్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీపీ కొండ శంకర్ వారివారి కార్యాలయాల వద్ద జెండాలను ఎగురవేశారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



జెడ్పీ కార్యాలయం వద్ద చైర్మన్ పుట్ట మధు

కమిషనరేట్ వద్ద..

కమిషనరేట్ కార్యాలయం వద్ద సీపీ రెమా రాజేశ్వరి జాతీయజెండాను ఎగురవేశారు. గతేడాది విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 25 మందికి సేవాపతకాలు అందించారు. అడిషనల్ డీసీపీ (ఏఆర్) రియాజ్ హుల్‌హక్, ఏసీపీ తుల శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



జేఎన్టీయూలో జెండా ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్

బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద..

బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జాతీయ జెండాను ఎగురవేశారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు అడ్డాల స్వరూప, దాతు శ్రీనివాస్, పెంట రాజేష్, బాలరాజ్ కుమార్, కొమ్ము వేణుగోపాల్ పాల్గొన్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ జెండాను ఆవిష్కరించారు.



జెండావందనం చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి



మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జెండావిష్కరణ



కాంగ్రెస్ కార్యాలయం వద్ద విజయరమణారావు



మంథని మున్సిపాలిటీ వద్ద మున్సిపల్ చైర్ పర్సన్

జాతీయ జెండాను ఎగురవేసిన బాబర్‌సలీంపాషా



జెండా ఆవిష్కరిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: 77వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ గుర్తింపు సంఘం కార్యాలయంలో ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా జాతీయ జెండాను ఎగురవేశారు. కార్పొరేటర్ కొలిపాక సుజాత, సంఘం నాయకులు పాల్గొన్నారు. ఇందిరమ్మకాలనిలో ఎన్టీపీసీ ట్రాక్టర్ అసోసియేషన్ కార్యాలయంలో కార్పొరేటర్ ఎన్వీ.రమణారెడ్డి, మేడిపల్లి సెంటర్‌లో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చెప్యాల రామారావు, బీజేపీ ఆధ్వర్యంలో మల్కాపూర్ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్, సీఐటీయూ భూ పోరాట కేంద్రంలో సీఐటీయూ నాయకుడు ఎన్.భిక్షపతితో పాటు పలు ప్రాంతాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

మాజీ మేయర్‌కు మాతృవియోగం



మల్లమ్మ(ఫైల్)

కోల్‌సిటీ: రామగుండం తొలి మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ తల్లి మల్లమ్మ (80) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. ఆమె కళ్లను దానం చేయడానికి లక్ష్మీనారాయణ ముందుకొచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, ప్రతినిధులు రాజమౌళి, చారి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరీఫ్ ద్వారా మల్లమ్మ నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల (దేవాపూర్)కు చెందిన యువకుడు (22) ద్విచక్రవాహనంపై కరీంనగర్‌కు వెళ్తున్నాడు. దుబ్బపల్లి వద్దకు రాగానే అదుపు తప్పి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు, పోలీసులు అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మంత్రి నుంచి ప్రశంస పత్రం అందుకున్న శ్రీవాణి



ఎలిగేడు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కరీంనగర్ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర ఆచార్యురాలు, జాతీయ సేవాపథకం సమన్వయకురాలు, ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కోడూరి శ్రీవాణి మంత్రి గంగుల కమలాకర్ చేతులమీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు అభినందించారు.

నేటి నుంచి కుష్టు సర్వే

- జిల్లావ్యాప్తంగా 517 బృందాలు
- జిల్లా జనాభా 8,90,6,152
- 2021 సంవత్సరంలో 21 కేసులు
- 2022లో 41కి పెరిగిన బాధితులు

సుల్తానాబాద్: జిల్లాలో కుష్టు చాపకింద నీరులా విస్తరిస్తోంది. వ్యాధిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏటా రెండుసార్లు సర్వే చేసి రోగులను గుర్తిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడు కూడా ఆశా కార్యకర్తలు, పురుష వైద్య సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. వీరంతా ఈనెల 16 నుంచి 31వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటా సర్వే చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులకు శిక్షణ పూర్తయింది.

లక్షణాల గుర్తింపు

జిల్లాలో 18 ప్రాథమిక, 6 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. సర్వే బృందాలు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నాయి. కుష్టు లక్షణాలను గుర్తిస్తాయి. చర్మంపై మొదట గోధుమవర్ణం మచ్చలు ఏర్పడతాయి. మైకో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వస్తుంది. ఈ వ్యాధి బాధితులతో ఎక్కువకాలం సావాసం చేసే వారికి సోకుతుంది. 3 నుంచి 15 లోపు లక్షణాలు బయటపడతాయి. ప్రారంభ దశలో గుర్తిస్తే నివారణ సులభమవుతుంది. నిర్లక్ష్యం వహిస్తే అంగవైకల్యం ఏర్పడే ప్రమాదం ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలుపుతున్నారు. 2020లో 14 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. 2021లో 21 మంది, 2022లో 41మందిగా గుర్తించారు.

చికిత్స అవసరం..

చర్మంపై ఒకటి నుంచి 5 వరకు మచ్చలు ఉంటే 6 నెలలు చికిత్స అందిస్తారు. 6 కంటే ఎక్కువ మచ్చలు ఉంటే ఏడాది పాటు చికిత్స పొందాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా అందిస్తారు.

మూడంచెల విధానం..

లక్షణాలు గుర్తించడం, వ్యాధి తీవ్రత ఉన్నవారికి సరైన వైద్యం చేరువ చేయడమే కార్యక్రమం లక్ష్యం. శరీరంపై స్పర్శ లేని మచ్చలను గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నారు. అనుమానితులకు స్థానిక పీహెచ్‌సీ, లెప్రసీ విభాగం అధికారులు పరీక్షలు నిర్వహిస్తారు. పాజిటివ్ వస్తే ఎండీటీ కొనసాగిస్తూ మందులు పంపిణీ చేస్తారు. మూడేళ్లుగా వరుస కార్యక్రమాలు చేపడుతుండటంతో బాధితుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.

అభివృద్ధిలో అగ్రభాగాన సింగరేణి



నృత్యాలు చేస్తున్న చిన్నారులు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు



ఆర్జీ–1లో ఉత్తమ కార్మికులతో జీఎం శ్రీనివాస్

గోదావరిఖని/రామగిరి: సమష్టి కారణంగా సింగరేణి సంస్థ అగ్రగామిగా నిలుస్తోందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం మనోహర్ తెలిపారు. జీఎం కార్యాలయాల ఆవరణలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడారు. ఆర్జీ–1 ఏరియాలో రూ.20కోట్లతో 20ఎంఎల్‌డీ, 15ఎంఎల్‌డీ సామర్థ్యం గల రెండు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం తొమ్మిది మంది కార్మికులను సన్మానించారు. ఆర్జీ–2 జీఎం మనోహర్ ఐదుగురు కార్మికులను సన్మానించారు. ఆర్జీ–1 సేఫ్టీ జీ ఎం సాంబయ్య, క్వాలిటీ జీఎం కేవీరావు, సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, అధికారుల సంఘం అధ్యక్షులు పొనగోటి శ్రీనివాస్, యూనియన్ నాయకులు గండ్ర దామోదర్‌రావు, మడ్డి ఎల్లయ్య, కె.సదానందం, ఖయ్యూం, మెండె శ్రీనివాస్, ఆకుల హరిన్, ఆర్జీ–2 సేవ అధ్యక్షురాలు సవిత, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరి యా ఇంజినీర్ నర్సింహారావు, యూనియన్ నాయకులు ఐలి శ్రీనివాస్, రాజరత్నం, మార్కండేయ, కుమారస్వామి, ఉల్లి మొగిలి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఆర్జీ–2లో ఉత్తమ కార్మికులతో జీఎం మనోహర్



రామగిరి: ఉద్యోగులను సమ్మానిస్తున్న జీఎం

ఆర్జీ–3లో..

ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో జీఎం సుధాకర్‌రావు, ఏపీఏ గనిలో జీఎం వెంకటేశ్వర్లు, జేఎన్టీయూలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, ఆయా కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు



ఓదెల: రామగిరి, సింగరేణి రైళ్లను రైల్వేశాఖ రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడోలైన్ మరమ్మతు పేరిట కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్య నడిచే రామగిరి, భద్రాచలం రోడ్ నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే సింగరేణి రైళ్లను రద్దు చేయడంతో విద్యార్థులు, రైతులు, సింగరేణి కార్మికులు, పాల వ్యాపారులు నానాతంటాలు పడుతున్నారు. వారం రోజులు ట్రాక్ మరమ్మతు ఉందని ప్రకటించిన రైల్వేశాఖ.. రెండు నెలలుగా చేస్తుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య ఇంటర్‌సిటీ, సిర్‌పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడవడం.. టికెట్ల ధరలు ఎక్కువగా ఉండటం, అన్ని స్టేషన్లలో హాల్టింగ్ లేకపోవడంతో మధ్య తరగతి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.